## క్లుప్తంగా

### పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

కోసూరువారిపాలెం(మోపిదేవి): విద్యార్థులను సొంతపిల్లలుగా చూసుకుంటూ వారిలో భయాన్ని పోగొట్టి పాఠశాలపై ఆసక్తి పెంపొందించాలని ఎంఈవో బి.గోపాల్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కోసూరువారిపాలెం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు తుంగల చంద్రశేఖర్, సీఆర్పీ బాలకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీకి 'కృత్తివెన్ను' విద్యార్థిని



కృత్తివెన్ను: కృత్తివెన్ను మండలం చినపాండ్రాక ప్రభుత్వ పాఠశాలకు చెందిన గరికముక్కు మౌనిక ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు పాఠశాల హెచ్ఎం సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. ఇటీవల జరిగిన పది పరీక్షల్లో మౌనిక 567 మార్కులతో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన మౌనిక ట్రిపుల్ఐటీలో సీటు సాధించడంపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థినిని అభినందించారు.

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థిని అజ్మీరా హర్షిణి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ కె.కిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### నీట మునిగిన వరిపొలం

కొక్కిలిగడ్డ(మోపిదేవి): రెండు రోజుల క్రితం కురిసిన అధిక వర్షాలకు తోడు పై నుంచి వచ్చిన వీటి ఒరవడికి వరి పం పూర్తిగా నీట మునిగిందని శుక్రవారం కౌలు రైతు మత్తి గోపాలరావు ఆవేదన చెందారు. మండంలోని కె. కొత్తపాలెం గ్రామానికి చెందిన రైతు నడకుదురు శ్రీ పృధ్వీశ్వరస్వామివారి దేవస్థానానికి చెందిన ఏడు ఎకరాలు కౌలు సాగు చేస్తున్నారు. వారం క్రితం వరినాట్లు వేసినట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి తోడు పైనుంచి వచ్చే నీటి వరవడికి నాట్లు వేసిన వరిపంట పూర్తిగా మునిగిపోయిందని వాపోయారు. డ్రైనేజి సౌకర్యం కూడా లేకపోవడంతో వెంటనే నీళ్లు బయటకు పోయే మార్గం కూడా లేదన్నారు. అధికారులు మురుగునీరు పోవడానికి ఏర్పాట్లు చేయాలని కోరారు.

### రోడ్డు నిర్మించాలని వినతి

గూడూరు: తరకటూరు సెంటరు నుంచి పిన గూడూరు లంక మీదుగా కలపటం గ్రామానికి రోడ్డు నిర్మించాలని కోరుతూ సర్పంచి ఐనాల దేవ నాగ శ్రీనివాస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. రూరల్ డెవలప్‌మెంట్ మానిటరింగ్ సెంట్రల్ టీమ్ సభ్యులు శుక్రవారం మండల పరిధిలోని కలపటం గ్రామంలో పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు శర్మ, గూడూరు మండల పరిషత్ ఏఓ కె.వి.రామకృష్ణ, పీఆర్ డీఈ నగేష్, ఏఈ జవహర్ పాల్గొన్నారు.

### గుండెపోటుతో ఘంటసాల వీఆర్ఏ మృతి

ఘంటసాల: ఘంటసాల వీఆర్ఏ పాతపాటి బిక్షం(64) గుండె పోటుతో మృతి చెందారు. ఘంటసాల అంబేద్కర్ నగర్‌కు చెందిన బిక్షంకు గుండె పోటు రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

బంటుమిల్లి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అన్నారు. చోరంపూడిలో శుక్రవారం డెంగినివారణ మాసోత్సవాల్లో భాగంగా వైద్యాధికారి సువర్చల పర్యవేక్షణలో సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇస్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కలిగించారు. సర్పంచ్ రేవు నాగలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు ఎం.ఏసుదాసు, ఏడుకొండలు, ఏఎన్ఎం ఇందిర తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: జూలై మాసం-డెంగ్యూ వ్యతిరేక మాసం సందర్భంగా ఆకులమన్నాడులో మల్లవోలు పీహెచ్‌సి వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పి.మురళి తదితరులు పాల్గొన్నారు.

### రోగపీడితులకు ఆర్థిక సాయం

మచిలీపట్నంటౌన్: మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇద్దరు రోగ పీడితులకు శుక్రవారం రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన కాసాని లక్ష్మీకాంతరావు కొంత కాలంగా వెన్నెముక సంబంధించిన వ్యాధితో బాధపడుతూ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. ప్రస్తుతం మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న మైత్రి ఫౌండేషన్ సభ్యులు ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించినారు. కాలేఖాన్‌పేట శివగంగకు చెందిన 14 ఏళ్ల విజయకుమార్ గొంతు దగ్గర కణితి (పుండు) సంబంధిత వ్యాధితో బాధపడుతూ దాతల సహకారంతో ఆపరేషన్ చేయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు రూ.10 వేల చెక్కును వైద్యఖర్చుల కోసం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు కేసాని వేణుకుమార్, గౌరవ అధ్యక్షులు ఏఆర్కే వరప్రసాద్, ఉపాధ్యక్షులు కాసాని ప్రసాద్, ఫుడ్ కమిటీ చైర్మన్ అనిల్ పాల్గొన్నారు.

# 1.3 కి.మీ.. 160 గుంతలు!

- చల్లపల్లి-నడకుదురు రహదారి దారుణం
- రోజూ వేలాది మంది ప్రజల ప్రయాణం
- అంచనాలతో సరి.. ఆమోదమెప్పుడో!



చల్లపల్లి-నడకుదురు రహదారిలో టీచర్స్ కాలనీ వద్ద రోడ్డు దుస్థితి

చల్లపల్లి: చల్లపల్లి, నడకుదురు రహదారిలో సుమారు 1.3 కి.మీ రోడ్డుపై 160 గోతులు దర్శనమిస్తున్నాయి. రహదారి పరిస్థితి చాలా దారుణంగా ఉన్నా అధికారుల్లో చలనం రావడం లేదు. అడుగడుగునా రోడ్డుపై ఉన్న గోతులతో వాహనచోదకులు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నాటి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చల్లపల్లి-నడకుదురు నిర్మాణానికి రూ.1.85 కోట్లు ఎస్ఆర్ గ్రాంటును మంజూరు చేయించారు. చల్లపల్లి ఎన్టీఆర్ పార్కు నుంచి టీచర్స్ కాలనీవరకూ 1.3 కి.మీ. మేర రోడ్డు బాగానే ఉండటంతో అది వదిలేసి అక్కడి నుంచి నడకుదురు కరకట్ట వరకూ ఆ నిధులతో కొత్త రోడ్డు వేయించారు. అప్పటి వరకూ ఆరోడ్డులో వెళ్లాలంటేనే హడలిపోయే వాహనచోదకులు కొత్త రోడ్డు వేయడంతో సాఫీగా ప్రయాణాలు సాగించారు. ప్రస్తుతం ఎన్టీఆర్ పార్కు నుంచి టీచర్స్ కాలనీ వరకూ 1.3 కి.మీ. వరకూ రోడ్డు అధ్వానంగా మారింది.

**టిప్పర్ల కారణంగా రోడ్లకు తూట్లు**

ముఖ్యంగా గత ఏడాదికాలంగా అధికలోడుతో అడ్డూఅదుపూ లేకుండా తిరుగుతున్న ఇసుక టిప్పర్ల కారణంగా రోడ్డంతా తూట్లు పడింది. రోడ్డుకు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవటంతో పెద్ద పెద్ద గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. కచ్చితంగా చెప్పాలంటే 1.3 కి..మీ. దూరంలో 160 గుంతలు పడ్డాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీటిలో పెద్ద అంగవేసి దాటగలిగేవి 125, జంప్‌చేసి దాటగలిగేవి 17 ఉన్నాయి. ఇక చిన్నపాటి తటాకాలుగా కనిపించేవి 18 ఉన్నాయి. వాహనాలు కూడా కూరుకుపోయేలాగా మారిపోయాయి అవి. వర్షం పడిందంటే ఈ రోడ్డులో వెళ్లాలంటే వాహనచోదకులు సాహసమే చేయాల్సిందే.



ఒక వాహనం వెళ్లేవరకూ మరో వాహనం ఆగాల్సిందే..

**ఈ రోడ్డును గాలికొదిలేశారు**

చల్లపల్లి మీదుగా విజయవాడ వెళ్లే ఆర్టీసీ కరకట్ట ఎక్స్‌ప్రెస్ బస్సులు రోజుకి 18 నడుస్తున్నాయి. అవన్నీ ఈ రోడ్డు మీదుగానే ప్రయాణిస్తుంటాయి. ఒక్కొక్క బస్సు రోజుకు మూడు ట్రిప్పులు వేస్తుంది. అంటే ఒక్కొక్క బస్సు రోజుకు నడకుదురు రోడ్డుపై ఆరుసార్లు ప్రయాణిస్తుందన్నమాట. ఈ లెక్కన మొత్తం 18 ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ 108సార్లు ఈ దారిలో వెళుతుంటాయి. ఇవికాక టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఇటుగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ రోడ్డును అధికారులు, పాలకులు గాలికొదిలేశారు. ఇప్పటికే ఈమార్గంలో అనేకమంది పడిపోయి గాయాలపాలయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి పాడైన ప్రాంతంలో కొత్తరోడ్డు వేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో కనీసం రోడ్డుపై గోతులన్నా పూడ్చి ఉపశమనం కల్గించాలని కోరుతున్నారు.

### వర్షం వస్తే మరింత ఇబ్బంది



రోడ్డు పూర్తిగా గోతులు పడింది. గోతుల కారణంగా వాహనంపై వెళ్లేవారు ఎగిరెగిరి పడుతున్నారు. వర్షం పడితే అంతే సంగతులు. తెలియనివారు గోతిలో దిగి ఇరుక్కుపోతున్నారు. వాహనం చక్రాలు గోతిలో పడినపుడు నీళ్లు జనాల మీద పడుతున్నాయి. –గొరివర్తి చంద్రశేఖర్, శ్రీనగర్

### రాత్రిళ్లు కనపడక పడిపోతున్నాం



ప్రతిరోజూ సైకిల్‌పై చదవుకునేందుకు నడకుదురు నుంచి చల్లపల్లికి వస్తాను. రాత్రి 7.30 గంటలకు ఇంటికి వెళతాం. రోడ్డు పాడవడంతో రాత్రిళ్లు పడిపోతున్నాం. రోడు బాగుచేయించాలని కోరుతున్నా.

–కోటి హర్షవర్ధన్, విద్యార్థి, నడకుదురు

### వాహనాలు మీదకు వస్తున్నాయి



చదువుకునేందుకు రోజూ సైకిల్‌పై పురిటిగడ్డ నుంచి చల్లపల్లికి వస్తా. ఈ రోడ్డుమీద పగలు వెళ్ళాలంటేనే భయంగా ఉంటోంది. స్కూల్ నుంచి ఇంటికి వెళ్లే సరికి రాత్రవుతోంది. అందుకే బ్యాటరీతో వెలిగే చిన్న లైట్లు కొనుక్కుని సైకిల్‌కి అమర్చుకున్నా.

–కేశాని శశికుమార్, విద్యార్థి, పురిటిగడ్డ

### రూ.13 కోట్లతో అంచనాలు పంపించాం

ఐదు కిలోమీటర్ల పొడవున్న చల్లపల్లి-నడకుదురు డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణానికి రూ.13 కోట్లతో అంచనాలు పంపించాం. అనుమతులు వచ్చేసరికి కొంత ఆలస్యం కావచ్చు. ఈ లోపు పాడైపోయిన రోడ్డును పరిశీలించి మరమ్మతులు చేస్తాం. అవసరమనుకుంటే తాత్కాలికంగా కొత్త సింగిల్ రోడ్డు నిర్మిస్తాం.

–ఎం.రమేష్, డీఈ, ఆర్అండ్‌బీ, అవనిగడ్డ

# శాకంబరీ.. శరణుశరణు



శాకంబరీదేవిగా శ్రీలక్ష్మీనాంచారమ్మ



కూరగాయల అలంకరణతో నరేంద్రుడు

గణపేశ్వరం(నాగాయలంక): శాకంబరీదేవి శరణుశరణు అంటూ భక్తజనం అమ్మవారిని స్తుతించారు. ఆషాఢ మాసం పురస్కరించుకుని మండలంలోని శ్రీదుర్గా, శ్రీగణపేశ్వరస్వామివారి ఆలయాల్లో శుక్రవారం శాకంబరి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మండల శ్రీరామచంద్రమూర్తి, నిర్వహణాధికారి సీహెచ్ సుధాకరరావు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు.

వల్లపల్లి: లక్ష్మీపురంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సహిత లక్ష్మీనాంచారమ్మను ఆషాఢ శుక్రవారం సందర్భంగా శాకంబరీదేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు శివసుబ్రహ్మణ్యం, ఎం.కోటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు దాలిపర్తి నారాయణరావు, మోదుమూడి కుటుంబరావు పాల్గొన్నారు.

**శాకంబరేశ్వరుడిగా నరేంద్రస్వామి**

నంగేగడ్డ(నాగాయలంక): గ్రామంలోని శ్రీబాలాత్రిపురసుందరీదేవి సమేత శ్రీనరేంద్రస్వామి దేవస్థానంలో ఆషాఢమాసం పురస్కరించుకుని శుక్రవారం శాకంబరి ఉత్సవం ఆలయ ధర్మకర్త మల్లాప్రగడ హరేరామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దాతలు సనకా సీతా రామంజనేయులు, సనకా హనుమాన్ సౌజన్యంతో సమకూర్చిన 100 కిలోల కూరగాయలు, పండ్లు ఆకుకూరలతో కొల్లిపర సుబ్బారావు నేతృత్వంలో అమ్మవారు, అయ్యవారి మూలవిరాట్ లను శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా రాహుకాల దీపారాధన, గౌరీపూజ జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

కోడూరు: మాచవరం తుంగపల్లెమ్మ అమ్మవారిని శుక్రవారం శాకంబరీదేవిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణమంతా మిర్చి, టమటా, బీరకాయ, సొరకాయ తోరణాలతో ముస్తాబు చేశారు.

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో భువనేశ్వరిదేవి శాకంబరీ అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు దీవి రఘునాథాచార్యులు, బాలకృష్ణమాచార్యులు విష్ణు సహస్రనామ, లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# సారె సమర్పణ



భావదేవరపల్లిలో శ్రీరాజ్యలక్ష్మీదేవికి సారె సమర్పించిన మహిళలు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీదేవి శ్రీభూదేవి సమన్విత శ్రీరాజ్యలక్ష్మీదేవి సమేత శ్రీభావన్నారాయణస్వామి ఆలయంలో ఆషాఢంలో ఆఖరి శుక్రవారం సందర్భంగా సారె వేడుక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో అమ్మవార్లకు గ్రామస్తులు సారె పళ్లేలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ పూషడపు నిరంజనరావు, సర్పంచ్ ఉదయభాస్కర్, ఆధ్యాత్మికవేత్త మెండు సాయిరామ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగాయలంక: గ్రామంలోని మండవ వంశీయుల కులదేవత గంగమ్మకు సారె సంబరం నిర్వహించారు. ఆలయ చైర్మన్ మండవ మధుసూదనరావు, జానకీ లక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

బంటుమిల్లి: చోరంపూడి గ్రామ దేవత వీర్లవెంకమ్మతల్లికి గ్రామస్తులు శుక్రవారం సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

## ప్రకృతి వ్యవసాయంలో మెలకువలపై అవగాహన

పెడన: ప్రకృతి వ్యవసాయంలో మెలకువలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. నియోజకవర్గంలోని వీఏఏలు, ఎంపీఈఓలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాల్లో రెండోరోజు శుక్రవారం క్షేత్ర స్థాయి వ్యవసాయ అధికారులు పర్యటించారు. మచిలీపట్నం మండలం పొట్లపాలెం, బుద్దాలపాలెంలోని పలు క్షేత్రాలను పరిశీలించి వాటిపై గ్రామ వ్యవసాయ సహాయకులకు అడిషనల్ డీపీడీ ఏపీసీఎన్ఎఫ్ మల్లీశ్వరి, ఫార్మర్స్ ట్రైనింగ్ సెంటర్ వ్యవసాయ సహాయ సంచాలకులు మచిలీపట్నం శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో అమలు చేసే మోడల్స్, బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం, దశకార్ని కషాయాల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా చూపారు. ఎల్ షేప్ ఫీల్డ్ బండ్ వరిలో రైతులు ఆసక్తి ఉంటే ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద సబ్సిడీ మీద ఉచితంగా బండ్ వేయడానికి స్కీం ఉందనే విషయాన్ని రైతులకు తెలియజేయాలని మల్లీశ్వరి తెలిపారు. కార్యక్రమంలో పెడన మండల వ్యవసాయ అధికారి ఎస్.స్నీ, ప్రకృతి వ్యవసాయం , వీఏఏలు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకులపై వైఎస్సార్ సీపీ నేతల ఫిర్యాదు



చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని)ని అవమానిస్తూ మాట్లాడటమే కాకుండా ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైఎస్సార్ సీపీ నేతలు శుక్రవారం చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 17వ తేదీ టీడీపీకి చెందిన పల్లపాటి సుబ్రహ్మణ్యం, మోటమర్రి బాబాప్రసాద్, కుంచే నాని, లోగిశెట్టి వీరాస్వామి, సయ్యద్‌ఖాజా, దింటకుర్తి సుధాకర్, లంకిశెట్టి నీరజ, కరెడ్ల సుశీల, పాలవర్తి పద్మజ, రామగాని రత్నాకరరావు, నారగాని కృష్ణ, పామర్తి లక్ష్మణ, గుర్రం నాగబాబు, పిన్నింటి అయ్యప్ప, ఎండీ సలీమ్, రాయపూడి ప్రసాద్, బండారు గంగాధరరావు, అబ్బాస్‌హుస్సేన్, గుర్రం నాగబాబు, ముంతా రవిచంద్ర, బోలెం హరిబాబు, పి వి ఫణికుమార్, చిట్టూరి యువరాజ్, పద్మనాభుని శేఖర్, వాలిశెట్టి హైమావతి, మరకాని సమతాకీర్తి, వేము కోటేశ్వరరావు తదితరులు రామానాయుడుపేట సెంటర్ నడిబొడ్డున తమ నాయకుడి దిష్టిబొమ్మను తగులబెట్టటంతో పాటు ఆయన కుటుంబాన్ని సమాధి చేస్తామంటూ బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎటువంటి అనుమతి లేకుండా పబ్లిక్‌కు తీవ్ర ఇబ్బంది కలిగిస్తూ గంటకుపైగా ట్రాఫిక్‌కు కూడా అంతరాయం కలిగించారని తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయాలని కోరుతూ సీఐ నబీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్ సీపీ నేతలు బొర్రా విఠల్, లంకే వెంకటేశ్వరరావు, గాజుల భగవాన్, పల్లి శేఖర్ ఇతర నాయకులు ఉన్నారు.

## పాలిటెక్నిక్ ఫలితాల్లో అఖిలాదేవికి బంగారు పతకం



అఖిలాదేవిని అభినందిస్తున్న కళాశాల చైర్మన్ ప్రసాద్ తదితరులు

పెడన: పాలిటెక్నిక్ ఫైనల్ ఇయర్ రిజల్ట్స్‌లో వాసవి పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ ఇంజినీరింగ్ చదువుతున్న అంకెం అఖిలాదేవి బంగారు పతకాన్ని సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీకే ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లోని అన్ని గ్రూపుల్లో కూడా స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఏపీ వారు విడుదల చేసిన ఫలితాల్లో అఖిలాదేవి స్టేట్‌లో రెండో ర్యాంకు సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుందని ఆయన పేర్కొన్నారు. ఆ విద్యార్థిని శుక్రవారం కళాశాలలో చైర్మన్ గుడివాడ ప్రసాద్, కార్యదర్శి తాడేపల్లి మెహర్‌బాబా, కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, తదితరులు అభినందించారు.

## పాత పెన్షన్ విధానం అమలు చేయండి



బందరులో ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు ధర్నా చౌక్‌లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57కు లోబడి అర్హులైన పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ సీపీఎస్ అమలులోకి రాకముందు నోటిపై చేసి నియమించిన ఉద్యోగులకు పాతపెన్షన్ అవకాశం కల్పిస్తూ విడుదల చేసిన మెమో అమలుచేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఫోరం రాష్ట్ర కన్వీనర్లు కేఎల్ శ్రీనాథ్, తమ్ము నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం సరైన పరిష్కారం చూపకపోతే విజయవాడలో మహోద్యమాన్ని ఆగస్టులో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సతీష్, సీఎం దాస్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్లు, ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్లు సతీష్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

# హారికపై దాడి ఘటనకు కారకులను శిక్షించాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజిబెత్‌రాణి, నాగరాజకుమారి



జెడ్పీ చైర్‌పర్సన్‌ను పరామర్శించిన రంగారావు, ఇతర బీసీ నాయకులు



జెడ్పీ చైర్‌పర్సన్ హారికను పరామర్శిస్తున్న ఎలిజిబెత్ రాణి, నాగరాజకుమారి

చిలకలపూడి(మచిలీపట్నం): జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై దౌర్జన్యం చేయటంతో పాటు అసభ్య పదజాలంతో దూషించి కారును ధ్వంసం చేసిన ఘటనకు కారకులను కఠినంగా శిక్షించాలని గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజిబెత్‌రాణి అన్నారు. ఈ మేరకు శుక్రవారం డీఆర్వో కె చంద్రశేఖర్ కు వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ప్రథమ పౌరురాలైన ఆమెకే రక్షణ లేకుండా పోలీసుల సాక్షిగా గూండాలు దాడి చేయటం హేయమైన చర్య అన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు దాడికి కారకులను అరెస్టు చేయకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. జెడ్పీ సీఈవో కన్నమనాయుడు అధికార పార్టీకి చెందిన నాయకుల చెప్పు చేతల్లో ఉన్నారని, జెడ్పీ వాహనం ధ్వంసమైనా పీఎస్‌లో ఫిర్యాదు చేయలేదన్నారు. దాడికి కారకులను కఠినంగా శిక్షించాలని జెడ్పీ సీఈవో వ్యవహరించిన తీరుపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గన్నవరం మండల ఉపాధ్యక్షులు సాతులూరి నాగరాజకుమారి, గౌడ సంఘ జిల్లా నాయకులు మరీదు రాంబాబు తదితరులు ఉన్నారు.

**మహిళలపై దాడులు దారుణం**

నాగాయలంక: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ అరాచకాలకు పరాకాష్టగా టీడీపీ గూండాలు బడుగు, బలహీన వర్గాల పైనే కాకుండా మహిళలపై సైతం వికృత దాడులు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. నాగాయలంకకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ చెన్ను రంగారావు నేతృత్వంలో పలువురు నియోజకవర్గ బీసీ నాయకులతో కలసి శుక్రవారం పెడనలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఉప్పాల రాము, హారిక దంపతులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించినట్లు రంగారావు తెలిపారు. హోం మంత్రి, డీజీపీ చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్‌ను పరామర్శించిన వారిలో గణపేశ్వరం సర్పంచ్ బెల్లంకొండ శ్రీనివాసరావు, ఉప్పాల ఉమామహేశ్వరరావు, కృష్ణకాంత్, మురళీమోహన్, ఈసారపు సీతారామయ్య తదితరులు ఉన్నారు.

**దాడి అమానుషం**

పెడన: ఉప్పాల హారిక, రాము దంపతులపై దాడి చాలా అమానుషమని, ప్రభుత్వం తక్షణమే స్పందించి దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజిబెత్ రాణి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె పెడన మండలం కృష్ణాపురంలోని హారిక నివాసానికి చేరుకుని చైర్‌పర్సన్‌ను పరామర్శించి దాడి సంఘటనలను అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు గన్నవరం వైఎస్సార్ సీపీ నాయకురాలు నాగరాజకుమారి, గౌడ సంఘం నాయకుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ 'కృష్ణా' అధ్యక్షుడిగా శ్రీరామ్



మచిలీపట్నంటౌన్: బీజేపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా తాతినేని శ్రీరామ్‌ను పార్టీ అధిష్టానం నిర్ణయించిందని ఆ పార్టీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ శుక్రవారం ప్రకటించారు. స్థానిక ఫంక్షన్ హాల్లో శుక్రవారం బీజేపీ జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ సత్యనారాయణ బీజేపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా తాతినేని శ్రీరామ్ నియమించినట్లు ప్రకటించారు. ఆయన్ను పలువురు నేతలు అభినందించారు.

## ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

విజిలెన్స్ డీఎస్పీ బంగార్రాజు



పురిటిగడ్డలో ఎరువుల బస్తాల నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ బంగార్రాజు

చల్లపల్లి: యూరియా, డీఏపీ వంటి ఎరువులను కృత్రిమ కొరత సృష్టించినా, ఎవరైనా అక్రమంగా నిల్వచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ డీఎస్పీ బంగార్రాజు హెచ్చరించారు. మండల పరిధిలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపులను బంగార్రాజు నేతృత్వంలోని విజిలెన్స్ అధికారులు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ హోల్‌సేల్, రిటైల్ లైసెన్సుదారులు అధీకృత కంపెనీల నుంచి నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేసి రైతులకు విక్రయించాలని సూచించారు. అమ్మకాలతోపాటు రసీదును కూడా రైతులకు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. తనిఖీల్లో ఏడీఏ పి.చంద్రశేఖర్, టెక్నికల్ ఏఓ ఎల్.శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మంచినీటి పంపుల ప్రాంతాన్ని ఆక్రమించారని ఫిర్యాదు

నాగాయలంక: గ్రామంలో మంచినీటి పంపులు ప్రాంతాన్ని ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టారని నంగేగడ్డ గ్రామస్తులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ శుక్రవారం తహసీల్దార్ ఆంజనేయప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రజలు 20 ఏళ్లుగా నంగేగడ్డ ఆరంభంలో 1వ నంబరు కాల్వగట్టు, పంట బోదె గట్టు పై చేతి పంపులు వేసుకుని గ్రామస్తులంతా తాగునీటిని తెచ్చుకుంటున్నారని, పంచాయతీ ప్రజలందరికీ ఈ నీరే దిక్కని పేర్కొన్నారు. పంట బోదె ద్వారా 80ఎకరాలకు సాగు జరుగుతుందని వివరించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఈ ప్రాంతం ఆక్రమించి ఆర్‌సీసీ నిర్మాణం చేస్తున్నారని తక్షణం ఆక్రమణలు నిలిపివేసి గ్రామ ప్రజలకు తాగునీటి వసతికి విఘాతం కలుగకుండా చూడలని తహసీల్దార్‌ను కోరారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ ఆక్రమలకు పాల్పడింది నంగేగడ్డ గ్రామ టీడీపీ నేత అని అతనికి మండల స్థాయి నేతలు అండగా ఉండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు: రామరాజుపాలెం, గూడూరు, కోకనారాయణపాలెం, ఆకుమర్రులో విద్యుత్ లైన్ల నిర్వహణను శనివారం చేపడ్తున్నట్లు కరెంట్ ఈఈ జి.గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఆయా గ్రామాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.